# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
2. ఆంధ్రప్రదేశ్‌లో వన్యప్రాణుల జీవనానికి ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.
3. రాష్ట్రంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా పశువులపై 50 శాతం రాయితీ అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.
4. తెలంగాణలో అర్హులందరికీ ఇళ్లను కేటాయిస్తామని, దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.
5. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి ఈరోజు.

=========================

రాష్ట్రంలోని పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ బోర్డు–ఏపీఐసీడీబీను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు కారిడార్ల పరిధిలోని పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త పారిశ్రామిక పార్కులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం ప్రతిపాదనల రూపకల్పనపై రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో రాష్ట్రంలో అభివృద్ధికి ప్రతిపాదించిన పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. పారిశ్రామిక కారిడార్ల పరిధిలో ప్రతిపాదించిన పార్కుల అభివృద్ధి వేగవంతం చేసేందుకు చట్ట పరిధిలో బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వన్యప్రాణి కారిడార్లు, అభయారణ్యాల్లోని వన్యప్రాణుల జీవనానికి ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశించారు. నిన్న మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ అధికారులతో రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణకు తగిన వాతావరణం కల్పించాలని, అదే విధంగా ఆ కారిడార్లు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. భారతమాల పరియోజన ద్వారా చేపట్టే నాలుగు వరుసల రహదారుల నిర్మాణం, షార్ సమీపంలో

తీరప్రాంత రక్షణ, కడప – రేణిగుంట మధ్య రైల్వే లైన్ లో రహదారుల నిర్మాణాలకు శాఖాపరంగా ఇచ్చే అనుమతులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ యువతను, రైతులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా పశువులపై 50 శాతం రాయితీ అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి రాయితీ అందిస్తున్నామని, లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తు సమర్పణ, బ్యాంకర్ల ప్రోత్సాహం వంటి అంశాల్లో పశు సంవర్ధక శాఖ అధికారుల సహకారం ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దశల వారీగా నియోజకవర్గాల్లో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం అమలు అయ్యే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో అర్హులందరికీ ఇళ్లను కేటాయిస్తామని, దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీల ఏర్పాటుకు రెండ్రోజుల్లో విధివిధానాలు రూపొందించాలని చెప్పారు. రాజీవ్ స్వగృహ పథకం కింద నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, గృహాలను వేలం వేయాలని సూచించారు. హైదరాబాద్‌లో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటిని అర్హులైనవారికి కేటాయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పర్యటించారు. కిష్టారంలోని ఉదండాపూర్ జలాశయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేస్తామన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులకు రూ.45 కోట్లు విడుదల చేశామన్నారు. అనంతరం గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను మంత్రులు పరిశీలించారు.

---------------------------

పర్యావరణ ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య సమాఖ్య – ఐ.ఎఫ్.ఈ.హెచ్. ఆధ్వర్యంలో 2009వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. పర్యావరణ ఆరోగ్యం అంటే నేల, జల, వాయువులలో ఉండే మిశ్రమాలు కాలుష్యం లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడం. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమస్యల కారణంగా ప్రతి ఏటా లక్షలాది మంది ప్రజలు మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. పర్యావరణ కాలుష్యానికి మనమే కారణ భూతులమవుతున్నామని, కరవు కాటకాలు, అత్యంత భారీ వర్షాలు, వరదలు వంటి పరిస్థితుల నివారణ కోసం ప్రపంచ వ్యాప్తంగా విస్తృత

స్థాయిలో మొక్కలు, మడ అడవులు పెంచడం, పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం,.పారిశుధ్య పరిస్థితులను మెరుగుగా ఉండేలా చూడడం, సౌర శక్తిని వినియోగించడం వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ సమతూకాన్ని కాపాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది.

---------------------------

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మగా ప్రసిద్ధులైన చిట్యాల ఐలమ్మ జయంతి ఈరోజు. 1895 సెప్టెంబర్ 26న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురంలో చాకలి ఐలమ్మ జన్మించారు.వివాహం అనంతరం పాలకుర్తిలో భూస్వాములు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆంధ్ర మహాసభ, గుత్పల సంఘం నడిపిన ఉద్యమంలో ఐలమ్మ ముందువరుసలో ఉండి పోరాడారు. ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయి. సాయుధ పోరాటానికి గొప్ప స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న తుదిశ్వాస విడిచారు.

---------------------------

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి ఈ నెల 28వ తేదీన తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లనున్నారు. తిరుమల పవిత్రతకు రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం భంగం కలిగించిందని, అందుకు ప్రాయశ్చిత్తంగా తిరుమలకు కాలినడకన వెడుతున్నానని ఆయన నిన్న సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు చేయాలని కూడా జగన్ మోహన రెడ్డి సూచించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరో అల్పపీడనంగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూ రి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని 14 జిల్లాల్లో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాముందని వాతావరణశాఖ వెల్లడించింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు పసుపు రంగు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణలో వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందిస్తామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్ నుంచే సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల చొప్పున అందించనున్నామని చెప్పారు.జీలుగ విత్తనాలు రైతులందరికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా నిల్వ చేయాలని అధికారాలను ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, మొదటి 100 రోజుల్లో ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

======================